నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

యాదాద్రి భువనగిరి

మంగళవారం 20 జూన్ 2023 | TUESDAY, JUNE 20, 2023 | YADADRI BHUVANAGIRI | పేజీలు PAGES : 12




అడ్డగూడూరులో మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి

# నాడు విధ్వంసం.. నేడు పచ్చదనం

**స్వరాష్ట్రంలోనే పర్యావరణ పరిరక్షణ**

- సీఎం కేసీఆర్ సారథ్యంలో హరిత విప్లవానికి నాంది
- దేశంలో అత్యధిక గ్రీన్ రెవల్యూషన్ సాధించిన రాష్ట్రం తెలంగాణ
- ప్రభుత్వ సంకల్పానికి పచ్చని చెట్లే సాక్ష్యం
- భవిష్యత్ తరాలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదు.. మంచి వాతావరణం
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- అడ్డగూడూరులో ఘనంగా హరితోత్సవం

8లో..

70 ఏండ్ల పరాయి పాలనలో ధ్వంసమైన పర్యావరణానికి తెలంగాణ హరితహారం గొప్పవరమని, నేడు ఆ ఫలితాలు కండ్ల ముందు సాక్షాత్కరిస్తున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం అడ్డగూడూరులో నిర్వహించిన హరితోత్సవంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ 2014కు ముందు మొక్కలు నాటే కార్యక్రమం అటవీ శాఖకే పరిమితమయ్యేదని, నాటి పాలకులు పచ్చదనం పెంపుకోసం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ఉద్యమం నడిపించిన తీరు గానే, హరితోద్యమం ద్వారా పెద్ద ఎత్తున ప్రజలతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. దశాబ్దాలపాటు కరువు ప్రాంతంగా మారిన తెలంగాణ ప్రాంతం నేడు పచ్చని పంటలు, దట్టమైన చెట్లతో చూడముచ్చటగా ఉందంటే హరితహారం కార్యక్రమమేనని చెప్పారు. అతి తక్కువ కాలంలో దేశంలో అత్యధిక గ్రీన్ రెవల్యూషన్ సాధించిన రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, కాలుష్యం, అనారోగ్యాల నుంచి రక్షించుకోవడానికి చెట్లు ఎంతో దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

– అడ్డగూడూరు, జూన్ 19



భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

- జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కల నాటింపు
- భాగస్వాములైన ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ప్రజలు
- అడ్డగూడూరులో మొక్కలు నాటిన మంత్రి జగదీశ్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి, ఎమ్మెల్యే కిశోర్
- తిరుమలాపురంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ సునీతామహేందర్‌రెడ్డి
- ముత్తిరెడ్డి గూడెంలో ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- దండుమల్కాపురంలో మొక్కలు నాటిన కూసుకుంట్ల
- జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే నాటుకున్న 1,25,500 మొక్కలు

లోపలి పేజీల్లో..

# పండుగలా హరితోత్సవం

రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా హరితోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అంతటా నర్సరీలను సందర్శించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో వేడుకలు చేశారు. అడ్డగూడూరులో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి.. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్, ఆయిల్ ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. తుర్కపల్లి మండలం తిరుమలాపురంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి.. భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపాలిటీ లక్కారంలోని తంగేడు వనంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, చౌటుప్పల్ మండలం దండు మల్కాపురంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా తెలంగాణ వచ్చాక జరిగిన హరిత వృద్ధిపై వారు వివరించారు. హరితోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే 1,25,500 మొక్కలు నాటినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి తెలిపారు.

– యాదాద్రి భువనగిరి, జూన్ 19 (నమస్తే తెలంగాణ)



తుర్కపల్లి మండలం తిరుమలాపురంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి

# చక్కబడిన చదువులు

- స్వరాష్ట్రంలో బడులు బలోపేతం
- విద్యపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం
- సర్కారు బడుల్లో ఇంగ్లిష్ మీడియం బోధన
- మన ఊరు-మన బడితో మారిన పాఠశాలల రూపురేఖలు
- గురుకులాల ఏర్పాటు.. ఒక్కో విద్యార్థిపై రూ.లక్షన్నర ఖర్చు
- దశాబ్ది వేడుకల్లో భాగంగా విద్యా దినోత్సవం

7లో..

సమైక్య పాలనలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యా వ్యవస్థలో సీఎం కేసీఆర్ సమూల మార్పులు తీసుకొచ్చారు. విద్యతోనే సకలం సిద్ధిస్తాయని భావించి సర్కారు పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేశారు. ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధనను ప్రవేశపెట్టడంతోపాటు డిజిటల్ విద్యను తీసుకొచ్చారు. మన ఊరు– మన బడి, మన బస్తీ–మన బడి కార్యక్రమం ద్వారా సకల వసతులు కల్పిస్తున్నారు. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. నాడు వెలవెలబోయిన స్కూళ్లు నేడు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. జిల్లాలో గురుకులాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడంతో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు, ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు అందించనున్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో గ్రంథాలయాలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లకు శ్రీకారం చుట్టనున్నారు.

– యాదాద్రి భువనగిరి, జూన్ 19 (నమస్తే తెలంగాణ)

